

కృష్ణకాలనీ : జిల్లా కేంద్రంలోని పవిత్ర కళాశాలలో బారులు తీరిన ఓటర్లు



చిట్యాల : పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన గండ్ర వెంకటరమణారెడ్డి



రేగొండ : తిరుమలగిరిలో బారులు తీరిన ఓటర్లు

# ప్రశాంతంగా ఓటింగ్

- ఉదయం నుంచి బారులు తీరిన ఓటర్లు
- ఉత్సాహంగా పాల్గొన్న యువత
- వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు
- పలు కేంద్రాలను పరిశీలించిన అధికారులు
- బందోబస్తు చర్యలు చేపట్టిన పోలీసులు

కృష్ణకాలనీ, నవంబర్ 30 : భూపాలపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. భూపాలపల్లి మున్సిపాలిటీలోని 48 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కావడంతో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి బారులు తీరారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎన్నికల అధికారులు సకల సౌకర్యాలు కల్పించారు. దివ్యాంగుల కోసం ప్రతి పోలింగ్ కేంద్రంలో వీల్ చైర్లు ఏర్పాటు చేశారు. ఓటర్లు వరుస క్రమంలో ఉండి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకు ఎవరూ రాకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి, జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీపీవో ఆశాలత, ఆయా శాఖల జిల్లా అధికారులు, జంగేడు రజడ్పీహెచ్ఎస్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేశ్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి బుర్ర సునీత తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

### చిట్యాలలో..

చిట్యాల : మండలంలో ప్రశాంత వాతావరణంలో గురువారం అసెంబ్లీ ఎన్నికలు జరిగినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ (ఏఆర్వో) తహసీల్దార్ సుమన్ తెలిపారు. మండలంలో 38 పోలింగ్ బూత్‌ల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు సెక్టార్ ఆఫీసర్లు తెలిపారు. అలాగే నైన్‌పాక, చిట్యాల మండల కేంద్రంలో పోలింగ్ సరళిని బీఆర్ఎస్ భూపాలపల్లి అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి పరిశీలించడంతో పాటు ఓటర్లతో ముచ్చటించారు. అలాగే మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ సందర్శించి ఓటింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా చిట్యాల సీఐ వేణుచందర్, ఎస్సై జంగిలి రమేశ్ చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో సెక్టార్ ఆఫీసర్లు అనిల్‌కుమార్, చంద్రశేఖర్, రమాకాంత్, సమ్మారావు, ఎడ్ల సునీల్‌కుమార్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ శైలజ, ఎంపీడీవో రామయ్య, ఆర్ఐ రాజు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

### రేగొండలో..

రేగొండ : భూపాలపల్లి నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికలు గురువారం మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. ఎన్ఐఆర్‌తో పాటు, నూతనంగా ఓటు హక్కు పొందిన యువత, దివ్యాంగులు, వృద్ధులు, సాధారణ ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. తొలిసారి ఓటు హక్కు వచ్చిన వారితో పాటు యువత ఓటింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే ఆరు నెలల పాపతో ఓ మహిళ క్యూలో నిల్చొని తన ఓటు వేసింది.

### టేకుమట్లలో..

టేకుమట్ల : మండలంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో మొత్తం 24 గ్రామ పంచాయితీలకు 28 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరిగాయి. టేకుమట్ల, రామకృష్ణపూర్(వీ), గర్మిళ్లపల్లి, రాఘవాపూర్ గ్రామాల్లో సాయంత్రం 6.30 వరకు పోలింగ్ కొనసాగింది. ఈవీఎంలు మొరాయించడం, ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా జరిగాయి. పోలీసు బందోబస్తుతో ఈవీఎంలను జిల్లా కేంద్రానికి తరలించినట్లు తహసీల్ధార్ మంజుల తెలిపారు..



టేకుమట్ల : పోలింగ్ కేంద్ర వద్ద ఓటు వేసేందుకు బారులు తీరిన ప్రజలు

### మొగుళ్లపల్లిలో..

మొగుళ్లపల్లి : మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో గురువారం నిర్వహించిన శాసన సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో 29,854 మంది ఓటర్లుండగా 37 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. కాగా 148 మంది సిబ్బంది విధులు నిర్వర్తించారు. ఉదయం 7 గంటకు పోలింగ్ ప్రారంభం కాగా రాత్రి వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం ఎల్లారెడ్డిపల్లె, మొట్లపల్లి గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించగా రెండు గంటల పాటు పోలింగ్ నిలిచిపోయింది. టెక్నిషియన్ వచ్చి కొత్త ఈవీఎంలను ఏర్పాటు చేయడంతో పోలింగ్ కొనసాగింది. మండల వ్యాప్తంగా 7 గంటల వరకు పోలింగ్ పూర్తి కాగా ఎల్లారెడ్డిపల్లెలో రాత్రి 8.30 వరకు ఓటింగ్ జరిగింది. మొత్తం 26,112 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 87.46 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ సేషన్ల వద్ద ఎలాంటి ఘటనలు జరుగకుండా స్థానిక ఎస్సై జాడి శ్రీధర్ సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహించారు.

### గణపురంలో..

గణపురం : మండలంలో శాసన సభ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా, ఓటు వేసేందుకు చిన్నచిన్న గొడవలు మినహా ఎలాంటి ఘటనలు చోటు చేసుకోలేదు. మండలంలో 36 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 4 గంటలకే పోలింగ్ ముగిసినప్పటికీ కేంద్రంలో ఉన్నవారికి అనుమతి ఇవ్వడంతో మైలారంలో రాత్రి 7.30 గంటల వరకు ఓటింగ్ జరిగింది. ఎస్సై మచ్చ సాంబమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మండలంలోని ఆయా పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి, డీఆర్డీవో పురుషోత్తం, డీపీవో ఆశాలత, ఇన్‌చార్జి తహసీల్దార్ మురళీధర్‌రావు తదితరులు సందర్శించారు.



మొగుళ్లపల్లి : ఎల్లారెడ్డిపల్లె గ్రామంలో రాత్రి వరకు కొనసాగుతున్న పోలింగ్



గణపురం : చెల్పూర్‌లో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు





మొగుళ్లపల్లి : పెద్దకోమటిపల్లెలో ఓటు వేసేందుకు బారులు తీరిన ప్రజలు

# స్ట్రాంగ్ రూమ్‌కు చేరిన ఈవీఎంలు

- సందర్శించిన కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎస్పీ కిరణ్ ఖరే

కృష్ణకాలనీ, నవంబర్ 30 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గురువారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను భారీబందో బస్తు నడుమ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియం ఆవరణలో గల స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. అర్ధరాత్రి వరకు తరలింపు ప్రక్రియ కొనసాగగా, కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎస్పీ కిరణ్ ఖరే పర్యవేక్షించారు. కాగా, అంబేద్కర్ స్టేడియంలోని సీఈఆర్ క్లబ్, మినీ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భవేష్ మిశ్రా, ఎస్పీ కిరణ్ ఖరే గురువారం రాత్రి పరిశీలించారు. అవసరమైప భద్రతను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ ముగిసే వరకు ఎలాంటి సమస్యలు రాకుండా అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



స్ట్రాంగ్‌రూమ్‌కు ఈవీఎంలను తరలిస్తున్న ఎన్నికల అధికారులు



భూపాలపల్లి మండలం గొర్లవీడు గ్రామంలోని పోలింగ్ స్టేషన్‌లో ఓటింగ్‌కు బారులు తీరిన మహిళలు



భూపాలపల్లిలో ఓటర్ స్లిప్‌లు ఇస్తున్న బీఎల్‌వోలు



పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన మహిళా ఓటర్లు